క్లుప్తంగా

భక్తులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, పోలీసులు

ఆత్మకూరు: మండే ఎండలను సైతం లెక్కజేయకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కాలినడకన వస్తున్న భక్తులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను ఆత్మకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందించారు. కాలినడకన వెళ్లే భక్తులకు పోలీసులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేపట్టడంతో భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టౌన్ సీఐ లక్ష్మీనారాయణ, రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్‌ఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'వాటర్‌బెల్'ను అమలు చేయాలి

జూపాడుబంగ్లా: వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో రోజూ మూడు మార్లు 'వాటర్‌బెల్' కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా విద్యాశాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి తప్పనిసరిగా రోజుకు మూడు మార్లు వాటర్‌బెల్ కొట్టాలన్నారు. ఉదయం 8.45గంటలకు, 10.05గంటలకు, 11.50గంటలకు తప్పనిసరిగా వాటర్‌బెల్ కొట్టి విద్యార్థులందరూ నీళ్లు తాగేలా చూడాలన్నారు.

80 శాతం పింఛన్ల పంపిణీ



అల్లూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ నరేష్‌కృష్ణ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం రెండోరోజు సామాజిక పింఛన్ల పంపిణీని అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని సచివాలయాల వద్ద లబ్ధిదారులకు పింఛన్లను అందజేసినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. మండలంలో మొత్తం 5,272 పింఛన్లు ఉన్నాయని వాటిలో 80శాతం మేర పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్



శ్మశానంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిలవ్వడంతో శ్మశానంలోకి దూసుకెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్నూలు-1 డిపోకు చెందిన ఏపీ 21జెడ్ 0588 అనే నంబరు గల ఆర్టీసీ బస్సు వెంకటాపురం వెళ్లి తిరిగి వస్తోంది. బ్రాహ్మణకొట్కూరు వద్దకు రాగానే బ్రేకులు సరిగా పడకపోవడాన్ని గమనించిన డ్రైవర్ సుధాకర్ బస్సును పక్కనే ఉన్న శ్మశానంలోకి తీసుకెళ్లి నిలిపివేశాడు. బస్సు డ్రైవర్ అప్రమత్తతో బస్సులో ఉండే 40 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు.

తల్లీకుమారుడి అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కుమారుడు (ఫైల్)

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరు ఎస్సీ కాలనీకి చెందిన తల్లి, కుమారుడు అదృశ్యమైనట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఎస్సీ కాలనీకి చెందిన మరియమ్మ, కుమారుడు చరణ్ 1వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. భర్త తన బంధువులు, చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త ఏసోబు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఇఫ్తార్ విందు

వెలుగోడు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సాయంత్రం 6:30 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం మైనారిటీలు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

తీరని పింఛన్ కష్టాలు



పాత ముచ్చుమర్రి సచివాలయం ఎదుట నిరీక్షిస్తున్న వృద్ధులు, మహిళలు



గువ్వలకుంట్లలో వికలాంగురాలికి ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగుడు



జూపాడుబంగ్లా-1 సచివాలయం వద్ద పింఛన్ల కోసం కిక్కిరిసిన లబ్ధిదారులు



సున్నిపెంటలో పింఛన్ కోసం వచ్చిన ముస్లిం మహిళలు

- రెండో రోజూ అవ్వాతాతలకు తప్పని పడిగాపులు
- ఏ సచివాలయంలో పంపిణీ చేస్తారో తెలియక అయోమయంలో లబ్ధిదారులు



జూపాడుబంగ్లా-1 సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచివున్న వృద్ధులు

జూపాడుబంగ్లా: అవ్వాతాతలకు, అక్కా, చెల్లెమ్మలకు పింఛన్ కష్టాలు తీరలేదు. రెండో రోజు గురువారం కూడా సచివాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండలంలోని వివిధ గ్రామసచివాలయాల గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యాంగులు, అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలు పడిగాపులు కాసారు. ప్రతి నెలా ఒకటోవ తేదీన తెల్లవారకముందే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్‌దారుల చేతిలో పింఛన్ డబ్బులు పెట్టడంతో వారు సంతోషించేవారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించడంతో పింఛన్‌దారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నెల 4వతేదీ వచ్చినా ఇంకా పింఛన్ల మందికోడిగా సాగుతుండటంతో సొమ్ము కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

87.23 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఏప్రిల్ మాసానికి గాను మండలానికి 5,121 పింఛన్లు మంజూరు కాగా గురువారం సాయంత్రానికి 4,467 పింఛన్లు పంపిణీ చేయటంతో 87.23శాతం పంపిణీ పూర్తైనట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. నడవలేని వారికి, మంచానికి పరిమితమైన వారికి సచివాలయ ఉద్యోగులు ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

గంటల తరబడి నిరీక్షణ

పగిడ్యాల: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలకు పింఛన్ల పంపిణీకి దూరమైన వలంటీర్ల స్థానంలో ఆ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించిన సంగతి విధితమే. అయితే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడంతో రెండవ రోజైన గురువారం పింఛన్‌దారులు సచివాలయాల దగ్గర గంటల తరబడి నిరీక్షించారు. భగభగ మండే భానుడి ప్రతాపానికి తాళలేని పలువురు వృద్ధులు సచివాలయాల వద్ద సొమ్మసిల్లి కునుకు తీశారు. ఉదయం 9 గంటలకల్లా పింఛన్ పంపిణీని ప్రారంభించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నా అరగంట ఆలస్యంగా సచివాలయాలకు చేరుకున్నారు. పేదలకు పంపిణీ చేసే పింఛన్లపైనా రాజకీయం చేసేదని టీడీపీ అధినేతపై వృద్ధులు తిట్లదండకం అందుకున్నారు. కాగా ఈనెల 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ కవిరాజు తెలిపారు.

అవే పడిగాపులు

శ్రీశైలంప్రాజెక్ట్: అసలే వేసవి కాలం, ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీరు రాజకీయ కారణాల వల్ల రాకపోవడంతో తప్పని సరిగా ఆధార్ కార్డులు, పెన్షన్ పుస్తకాలు పట్టుకొని పింఛన్‌దారులు సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. గురువారం సున్నిపెంటలోని మూడు గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ కొనసాగింది. దివ్యాంగులు, వృద్ధులు, ఎప్పుడూ బయటకు రాని ముస్లిం మహిళలు సైతం సచివాలయాలకు వచ్చి పింఛన్ తీసుకుంటున్నారు. ఇంకొందరికి ఏ సచివాలయంలో తమకు పింఛన్ ఇస్తారో తెలియక అయోమయంలో ఉన్నారు.

తప్పని తిప్పలు

పాములపాడు: పింఛన్ కోసం సచివాలయాల వద్దకు నడిచి వెళ్లడం, ఉదయం 10.30 గంటలైనా డబ్బు రాకపోవడంతో పింఛన్ దారులకు తిప్పలు తప్పడం లేదు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో వృద్ధులు, వితంతువు, వికలాంగులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉదయం 10.30 గంటలైనా డబ్బులు రాకపోవడంతో లబ్ధిదారులు ఆధార్ కార్డులు వరుస క్రమంలో ఉంచారు. దీంతో మళ్లీ పాత రోజులను గుర్తు చేసినట్లయ్యింది. ఆధార్‌కార్డులు వరుస క్రమంలో ఉంచి అధికారులు పిలిచే వరకు అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితి.

రెండునెలలే ఈ కష్టాలు



ఇంకెంత కాలమండి రెండు నెలలు ఆగితే ఈ కష్టాలు మాకు తీరిపోతాయి అంటున్నాడు దివ్యాంగుడు రాము. ఇన్నేళ్లు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి ఒకటవ తేదీనే పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు దుర్మార్గానికి పరాకాష్టగా మమ్మల్ని ఇలా మండుటెండల్లో ఇబ్బందులు పెట్టిస్తున్నాడు. ప్రజా సంక్షేమం కోరే వారికే వచ్చే ఎన్నికల్లో విజయం వరిస్తుంది. అందాకా ఇలాంటి పైశాచిక చర్యలు భరించాల్సిందే.

– కె.రాము, భగత్‌సింగ్ కాలనీ,సున్నిపెంట

ఇంటింటికీ వెళ్తూ పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: సచివాలయ సిబ్బంది రెండవ రోజు గురువారం ఉదయం నుంచే గ్రామాలలోని నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులు ఇక్కు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నారు. గురువారం 92.23 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు.

మహానంది: మహానంది మండలంలో 5,316 పింఛన్లు ఉండగా గురువారం నాటికి 4,930 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలంలో 6701 మంది లబ్ధిదారులు ఉండగా 6172 మందికి అందించామని ఎంపీడీఓ విజయరావు వెల్లడించారు.

చంద్రబాబు కుట్రలను తిప్పికొడదాం





ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మహానంది నాయకులు, బండిఆత్మకూరు మండలం జి.లింగాపురంలో నాయకులు

- పార్టీ గెలుపే లక్ష్యంగా శ్రమించాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహానందిలో 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- బండిఆత్మకూరు మండలం లింగాపురంలో 80 కుటుంబాలు

మహానంది: ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్రలను ప్రజలకు తెలియచేస్తూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని అందరికీ వివరిస్తూ వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో టీడీపీ నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే శిల్పా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహానందిలోని పార్వతీపురం, ఈశ్వర్‌నగర్ కాలనీలకు చెందిన వడ్డె కుంచపు రవి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి, సుమంత్, మనోహర్ తదితర 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, మహానంది మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, మండల యువనాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, మహానంది మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాపురంలో 80 కుటుంబాలు

బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలో ఆది నుంచి టీడీపీలో ఉన్న ఎన్‌టీఆర్ అభిమానులు, ముస్లిం మైనార్టీ, బీసీ కులాలకు చెందిన 80 కుటుంబాల వారు గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎంపీటీసీ భూమా వెంకటనాగిరెడ్డి, గోపిరెడ్డి వెంకటరెడ్డి, గోపిరెడ్డి తిరుపంరెడ్డి ఆధ్వర్యంలో 80 కుటుంబాల వారు పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన భూమా విశ్వనాధరెడ్డి, భూమా సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, నూర్ అహమ్మద్, గని పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రాధమ్మ, ఎంపీటీసీ అర్జున్, గ్రామ నాయకులు నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, భూమా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



బైరెడ్డి నగర్ పర్యటనలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు కష్టాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కర్నూలు రోడ్డు బైరెడ్డి నగర్‌లో పర్యటించారు. ప్రజలను అప్యాయంగా పలకరించారు. సిద్ధార్థరెడ్డిని మర్యాదపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సెంట్రింగ్ వలి, వెంకటస్వామి, ఇస్మాయిల్, నూనెబాషా, పూలబాషా, అయూబ్, మహబూబ్‌బాషా, వలి, ముజీబ్, షేక్షావలి, షేక్షా, మహమ్మద్ రఫి, బషీర్, మహమ్మద్, అబ్దుల్లా, మౌలాలి, అబ్దుల్ కలాం, బాషా, ఫారూక్, సందీప్, మహేష్, సంతోష్, యక్షిత్ తదితరులు కలిశారు. సిద్ధార్థరెడ్డిని గజమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల కంటే అధికంగా 2024 ఎన్నికల్లో పెద్ద ఎత్తున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నేటి నుంచి పట్టణంలో ఎన్నికల ప్రచారం

ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పట్టణంలో ఎన్నికల ప్రచారం చేపడుతునట్లు సిద్ధార్థరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బైరెడ్డి నగర్‌లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కౌన్సిలర్లు కృష్ణవేణి, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, ఉపేంద్రారెడ్డి, జబ్బార్, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో శాప్ చైర్మన్

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట, లక్ష్మాపురం గ్రామాల్లో గురువారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్‌ను ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. అనంతరం దువా ఆచరించారు. శాప్ చైర్మన్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ముందస్తు బడీ రాత్, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నా ముస్లింలు కఠోరంగా ఉపవాస దీక్షలు ఆచరించడం అల్లాపై వారికున్నా అచెంచలమైన విశ్వాసానికి నిదర్శనమన్నారు. అల్లా దీవేనలు ఎల్లప్పుడు వారి కుటుంబాలపై ఉండి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా తదితరులు ఉన్నారు.

సచివాలయాల వద్ద సౌకర్యాలు కల్పించాం



మంచానికే పరిమితమైన ఖాసింబీకి పింఛన్ అందజేస్తున్న అధికారులు

నందికొట్కూరు: సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు నీడ, మంచినీరు, కుర్చీలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 14 సచివాలయాల్లో 5,020 మంది పింఛన్‌దారులకు గాను 4,468 మందికి పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. నడవలేక, మంచాలకే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. నాల్గవ సచివాలయ పరిధిలో మంచంపై ఉన్న ఖాసింబీ అనే వృద్ధురాలికి పింఛన్ అందజేశారు. అనంతరం ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన, చల్లని మజ్జిగను కమిషనర్ కన్నడిగులకు పంపిణీ చేశారు.

రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ చేపట్టాలని ఈఓ డి.పెద్దిరాజు సూచించారు. శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కన్నడ భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా గురువారం అన్నప్రసాద వితరణ భవనాన్ని ఈఓ పరిశీలించారు. అన్నదాన భవనంలోని అన్నదాన ప్రదేశాలు, భక్తులు వేచివుండే గదులు, వంటశాల మొదలైన వాటిని సందర్శించారు. భక్తులకు, ఉత్సవాలలో ప్రత్యేక విధులు నిర్వహించేందుకు వచ్చిన సిబ్బందికి, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు లోటుపాట్లు లేకుండా అన్నప్రసాదం అందజేయాలన్నారు. భక్తులు అధికసమయం వేచిఉండకుండా ఉండేవిధంగా అన్నప్రసాదాలను అందజేయాలని సూచించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను, ఆయా ఏర్పాట్లను పరిశీలించారు.

కూలీల చెంతకే వైద్యం

కొత్తపల్లి: 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. గురువారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య వైకేంద్రం వైద్యాధికారి జబీర్ బాషా ఆదేశాలతో సిబ్బంది ముసలిమడుగు సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఒంటినొప్పులు, జ్వరం, విరోచనాలకు మందులు పంపిణీ చేశారు.

తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహిస్తే చర్యలు

శ్రీశైలంప్రాజెక్ట్: మారుతున్న సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని, తప్పుడు సమాచారాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని సున్నిపెంట సీఐ జె.రమేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం పోలీస్ అవుట్‌పోస్టులో విలేకరులను సమావేశానికి పిలిచి నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని దామగట్ల జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులందరూ తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు అనితాజీవన్ తెలిపారు. విరామ సమయంలో తాగునీటితో పాటు మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. సహకరించిన ఉపాధ్యాయ సిబ్బందిని ఆమె అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

వెలుగోడు: మండల పరిధిలోని మోతుకూరు, బోయరేవుల గ్రామ సమీపంలో జరుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ అన్వరాబేగం గురువారం పరిశీలించారు. కూలీలు సమయపాలన పాటించి ఉదయం 6 గంటలకంతా పని ప్రదేశంలో ఉండాలన్నారు. 11 గంటలలోపు పని పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. కూలీలకు ఏపీడీ గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



సీఈ, అధికారులతో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: దక్షిణ మధ్య రైల్వే ట్రాక్ చీఫ్ ఇంజనీర్ డి.ఆంజనేయులు రెడ్డి, సిబ్బంది గురువారం రాత్రి మహానందికి వచ్చారు. వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి, అమ్మవారి ప్రసాదాలు, మెమంటో అందించి వేదాశీర్వచనం చేయించారు.

దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్లో 2024–25 ఏడాదికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరవీంద్ర గురువారం తెలిపారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉంటాయని తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈనెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను సెల్: 9908637913, 7013530668 ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

15 మంది వలంటీర్ల రాజీనామా

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గ్రామంలో 13 మంది వలంటీర్లు ఉండగా గురువారం 12 మంది తమ రాజీనామా లేఖను ఎంపీడీఓ విజయరావుకు అందించారు. భోజనం గ్రామంలో మరో ముగ్గురు రాజీనామా చేశారు. ఇప్పటికే ఇదే గ్రామంలో నలుగురు రాజీనామాలు చేశారు. తాజాగా 15 మంది వలంటీర్లు రాజీనామా చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

వైభవంగా సుంకులమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో సుంకులమ్మదేవతా విగ్రహ ప్రతిష్ట బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరయ్యారు. అమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు మునుపు పురోహితులు హోమం వద్ద పూజలు నిర్వహించారు. అమ్మ వారికి కాయ, కర్పూరాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి, ఎంపీటీసీ దర్గాబాయి, నాయకులు గోదాసు సాంబ, బియ్యాల శ్రీనివాస్ రెడ్డి, సుంకన్న, సుధాకర్, మస్తాన్, వంశీ, మురారి, ప్రకాష్, రోహిత్, నవనేశ్వర్, రమన, చిన్న వేణుగోపాల్, చౌడయ్య, బంగారం తదితరులు పాల్గొన్నారు.

కొండ నిండా కన్నడ భక్తులు



పాదయాత్రగా వస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం కొండపై కన్నడ భక్తులు నిండిపోయారు. ఏ వైపు చూసినా కన్నడ భక్తులతో శ్రీగిరి క్షేత్రం కిక్కిరిసింది. క్షేత్ర పరిధిలో కన్నడ భక్తుల డ్యాన్స్‌లు, భజనలు, ప్రత్యేక పూజలతో ఉగాది ఉత్సావాలు మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు జరుగనున్న ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి కన్నడ భక్తులు వేలాదిగా శ్రీశైలం చేరుకున్నారు. పలువురు భక్తులు తమ సొంతగ్రామాల నుంచి పాదయాత్రగా తరలివస్తున్నారు. పాదయాత్రలో మల్లికార్జున స్వరూపమైన కంబి(పల్లకీ)ని భుజాన మోసుకుంటూ, కాళ్లకు కర్రలు కట్టుకుని తరలివస్తున్నారు. అంతేకుండా ఎండవేడిమిని సైతం లెక్కచేయకుండా వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధ మహిళలు సైతం మల్లన్నపై భక్తితో నల్లమల అటవీప్రాంతం గుండా పాదయాత్ర చేసుకుంటూ తరలివస్తున్నారు. కన్నడ భక్తుల శివనామస్మరణతో నల్లమల అటవీప్రాంతం మారుమోగుతుంది.



కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తులు



పల్లకీ మోసుకుంటూ వస్తున్న కన్నడ భక్తుడు



భక్తులతో శ్రీగిరి వీధిలో సందడి



పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కైలాసద్వారం వద్ద ప్రత్యేక పూజలు